# • లాటరీ •

శ్రీయుత పి. వి. రామచంద్రమూర్తిగారు బి. ఏ.

## ( రేడియో ఉపన్యాసము )

కామాక్షి: ఏమిటినాన్నా వెతుకుతున్నావ్ ?

విశ్వనాథం: అయిదురూపాయిల నోటమ్మా. ఈ డ్రాయర్లో పెట్టేను !

కా: ఏమిటీ ! 5 రూపాయిలు నోటా ! మొన్న దీపావళికి పట్టుపరికిణీ కుట్టించమంటే రాగిదమ్మిడీకూడా లేదన్నావ్. 5 రూపాయిలు పెట్టుకునే అబద్ధమాడావన్నమాట. పోనీలే.

విశ్వ: అదికాదమ్మా, చాకలివాడిబాకీ తీర్చడంకోసం ప్రత్యేకంగా ఆనోటు దాచా. అలా కేటాయింపుగా ఉంచకపోతే ఐదుగాదు 5 వందలకి సరిపడేఖర్చుంది...సరే ఇంతకీ నోటేమయింది ?

కా: ఏమయిందా ? నీవు లేదని అబద్ధం చెప్పినందుకు, అలాగే లేకుండాపోయింది !

విశ్వ: అబ్బ ! ఎదిపట్టుకుంటే అదేనే నీకు...ఆనోటు పోయిందీ తెలీదు, ఉన్నదీ తెలీదు...ఒరేయ్ పెద్దబ్బాయి, ఈ డ్రాయర్లో నోటుపెట్టేను, మీరెవళ్లైనా చూశారా ?

రాఘవరావు: ఏమిటండీ, ఫైవ్‌రూపీ నోటేనా ?

విశ్వ: ఔను.

రాఘు: ఇప్పుడేంచెబుతుందో అమ్మ ! పిచ్చి ఆలోచనలకిపోయి డబ్బు తగలెయ్యకమ్మా అని చెబితే వింది కాదు ?

విశ్వ: తగలెయ్యడమేమిటి ? మళ్లీ తగరపుతప్పేలా ఏమైనా కొందేమిటి ?

రాఘు: ఆలాగైతే నయమే !

విశ్వ: మరేంచేసినట్లు ?

రాఘు: ఆవిణ్ణే అడగండి. నేను చెవికిల్లుగట్టి పోరేను వద్దని. పోనీ నాన్నగారితో సలహాచేసి కాని చెయ్యొద్దన్నా. వినందే.

కాంతమ్మ: (ప్రవేసించి) ఏమిట్రా అది ? నామీద ఏవో నేరాలు చెబుతున్నావ్ ?

రాఘు: ఆ 5 రూపాయిల సొమ్ము ఎలా తగులడిందని నాన్నగారడుగుతున్నారు.

కాంత: (కొంచెం చిరాకుతో) తగలెయ్యడమేమిట్రా తెలివితక్కువవాజమ్మా ! అలాంటి అవాచ్యం మాటలు నోటమ్మట రాకూడదు.

విశ్వ: (కొంచెం విసుగుతో) సరేనో ! మరేంచేశావో చెప్పరాదూ ?

కాంత: ఏమిటండీ నేనేదో పాడుచేసినట్లు నిలదీసి అడుగుతున్నారు ! ఆ సొమ్ము సద్వినియోగమే ఐంది.

విశ్వ: అంటే ?

కాంత: ఈవేళ శుక్రవారం మహాలక్ష్మికి భక్తితో పూజ్చేసి, ధనప్రాప్తి కలగాలని కోరుకుంటూ...

విశ్వ: సరి ! ఆ 5 రూపాయిలూ చిట్టిశాస్త్రులుకి దక్షిణగా ముట్టచెప్పినట్టున్నావ్.

కామాక్షి: (మెల్లిగా) కాదునాన్నా, లాటరీలో వేసింది.

విశ్వ: (నిర్ఘాంతపోయి) లాటరీలోనే ! 5 రూపాయిలూనా ?

రాఘు: ఆహా ! నిస్సంకోచంగా !

విశ్వ: ఇదేమిటే ? మనకి లాటరీ ఎందుకే ? కష్టపడి సంపాదించుకుంటూన్న డబ్బుతో తృప్తిపడక, లాటరీలో అప్పనంగా డబ్బొచ్చిపడాలన్న దురాశపట్టుకుందేమిటి ?

కాంత: దురాశేమిటండీ ! డబ్బుచేదామిటి ? అదృష్టం బాగుండి ఏ పాతికవేలో వస్తే, హాయిగాఉండొచ్చు.

విశ్వ: (హేళనగా) పాతికవేలే ! చాలా !

కాంత: ఎందుకండీ ఆ వెటకారం ? పెసరట్ల బుచ్చిలింగానికి లక్షరూపాయిలు రాలేదూ! ఆమాత్రం చెయ్యక పోయామా మనం ?

విశ్వ: (చిరాకుతో) చాల్లే ! 'తెలివితక్కువపనిచేశాం' ! అని అఘోరించక, ఇంకా సమర్థించుకుంటున్నావ్. ఇంతకీ తప్పంతా నాది ! సొమ్ము పెట్టిలో పెట్టి తాళంవేసుకోక, 'ఎవళ్లిష్టమొచ్చినట్లు వాళ్లు తగ లెయ్యండ' ని డ్రాయర్లో పెట్టి పోవడమేమిటి ?

కాంత: (చిన్నబుచ్చుకుని) నేను జన్మానికల్లా శివరాత్రని ఒక్కమాటు ధైర్యంచేసి మీడబ్బు ముట్టుకున్నందుకు, మీ యిష్టంవచ్చినట్లు మాట్లంటున్నారు. అనండి ఎన్ని అనాలో ! ఇంతకీ ఆడదాన్నని నోరుమూసు కూరుకోక ఇంత స్వతంత్రించడమేమిటి నేను !

(అంతా నిశ్శబ్దం)

కా: అడుగో చిన్నన్నయ్యొస్తున్నాడు.

ఆనందరావు: (ప్రవేశించి) ఏమిట్రా ! అంతా ఓచోటజేరి ధ్యానంచేస్తున్నారు ?

కా: (కొంచెం రహస్యంగా) చిన్నన్నయ్యోయ్ ! అమ్మేమో లాటరీలో 5 రూపాయిలేసిందని నాన్న కోప్పడ్డాడు.

ఆనం: I see! (అందరిముఖాలూ Study చేసి) అమ్మా, లాటరీలో ఎందుకేశావే ?

విశ్వ: ఎందుకేమిటీ ? ఒక్కమాటుగా పాతికవేలొచ్చి పడతాయని !

ఆనం: (సీరియస్‌గా) అయిదయిదులు ఇరువై ఐదు. రూపాయిపెట్టుబడికి 5 వేలు రాబడన్నమాట ! ఇంకనే ! ఫస్టుక్లాస్ ఇన్వెస్టుమెంటూ ! 'డబ్బొస్తే అంతా సుఖపడొచ్చు' అనే ఉద్దేశంతో లాటరీవేసింది గనక ఆవిడ ఉద్దేశంకూడా బోనాఫైడీయే ! ఇంక అమ్మమీద కేసేముంది నాన్నా !

విశ్వ: (చిఱునవ్వుతో) అమాంతంగా ఆ పాతికవేలూ ఒక్కమాటొచ్చిపడితే దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టడం అని ఆలోచిస్తున్నా కాని, కేసేమిటి ?

ఆనం: ఎలా ఖర్చుపెట్టడం అనే విషయంకూడా ఇప్పుడే సెటిల్ చేసుకోడం మంచిది. ఈవేళ చేసుకోగల పని ఇంకోప్పటికి పోస్టుపోన్ చెయ్యడమెందుకు ?...ఏమోయ్, అన్నయ్యా, నీకేమైనా సొమ్ము కావలసుంటుందా ?

రాఘు: రెడీగా ప్లానున్నవాణ్ణి నేనే. మొన్న మా ప్రొప్రయిటరుకీ నాకూ మాటామాటవచ్చి 'ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేద్దామా' అన్నంత చిరాకేసుకొచ్చింది. మనకే డబ్బుంటే స్వతంత్రంగా బిజినెస్ ప్టార్టు చేసుకొని ఒహడికి ప్రాధేయపడక్కర్లేకుండా ఉండొచ్చు అనుకున్నా. మనకు సొమ్మువచ్చే విధానంఉందీ అంటే ఆమరుక్షణమే వెళ్లి, ప్రొప్రయిటరుతో 'నువ్వెంతచేసు నీఉద్యోగం ఎంతచేస'ని మొహంమీద నాలుగూదులిపేసి చక్కావస్తా.

ఆనం: భేష్! అప్పుడు 'రావ్ బ్రదర్సు - కెమిస్టున్ అండ్ డ్రగిస్ట్సు' అని బ్రహ్మాండమైన బోర్డు తయారు చేయించి, వాడి షాపుకెదురుగుండానే నీ షాపుకూడా పెట్టి వాడి బిజినస్సంతా నువ్వేవేసుకోవచ్చు! ఒక చిన్న కారుకూడా కొను. అయితే మొదట పెట్టుబడికి ఏమాత్రం కావలసుంటుంది.

రాఘు: అంతా పోగుచేస్తే ఏడెనిమిదివేలకంటె ఎక్కువవదు.

విశ్వ: సరే తొమ్మిదివేలనుకుందాం. ... ఆనందం! నీ స్కీమేమిట్రా.

ఆనం: (చులాగ్గా) ఈ ఆనర్సు పూర్తిఅయే అవడంతో డైరక్టుగా ఇంగ్లండు వెళ్లిపోవడం. I C.S. కి అపియరవడం. సెలక్టయి టుప్‌టాప్‌గా చక్కారావడం.

రాఘు: ఇంటిపేరు పేరుక్రిందా, పేరు ఇంటిపేరుక్రిందా తారుమారుచేసి, A. గుంటముక్కల I. C. S. అని వ్యవహరింపబడడం.

ఆనం: పేరు అంత పొడుగుంటే బాగుండదు. అంతేకాకుండా కేవలం వైదికంగా ఉందది. చూడు A. G. ముఖల్ I. C. S. అంటే సొంపుగా ఉంటుంది.

విశ్వ: రైట్! నీ I. C. S. కి ఓ 10 వేలు పడుతుందనుకుంటా.

ఆనం: ఆ ఎలాగో మేనేజ్ చెయ్యొచ్చు.

విశ్వ: అమ్మడూ! నీక్కూడా ఏమికావాలో చెప్పెయ్యి, ఆనక మళ్లీ చెప్పకుండా.

కామా: (ఆలోచించి, ఆలోచించి) నాకా? నాకో గొలుసు చేయించు నాన్నా!

కాంత: ఓసి వెఱ్ఱిమొహమా! ఇంతేటే. అన్నలిద్దరూ తండ్రి సంపాదించిన ఆస్తికి మళ్లే తలోపదేసివేలూ పంచుకుంటూంటే, నీకొక్క గొలుసేటే కావలసింది?

రాఘు: పోనీ అమ్మా, చెల్లికి తెలియకపోతే దానికేంకావాలో నువ్వాలోచించి చెప్పరాదూ?

కాంత: ఏంకావాలేమిటి? బోలెడంత ఖర్చుంది. దానికి మంచి సంబంధం చెయ్యాలంటే తగినకట్నంఇయ్యాలి. లాంఛనాలన్నీ జరపాలి. నగలనీ, నాణేలనేకాకుండా, ముద్దుముచ్చట్లన్నో జరగాలి. అప్పుడతాత్తుగా సొమ్ముకోసం తడుముకోడంకంటె, ఇప్పుడే ఓ 5 వేలైనా బ్యాంకులో వెయ్యడం మంచిది.

ఆనం: Good Idea! సరేకాని, అమ్మా, నీకేంకావాలో చెప్పేవు కాదు.

కాంత: నాకా నాయనా, తండ్రీ కొడుకులూ చేరి అయిందానికీ కానిదానికీ చివాట్లెట్టకుండాఉంటే అదే చాలు. నాకింకేమీ అక్కర్లేదు.

కామా: నాన్నోయ్, అమ్మకేంగావాలో చెప్పనా!

కాంత: ఏంకావాలో నీతో చెప్పించానేవిటి?

కామా: ఇంజనీరుగారి పెళ్లాం నిన్ను చేయించుకోమని చెప్పలేదూ?

కాంత: ఊహూ! అన్నీ విన్నొచ్చి, నిన్నిక్కడ చెప్పమన్నారు కాబోలు! ఇంజనీరుగారి భార్యకేం, ఆవిడ తొంభై చేయించుకోమంటుంది. మనకు తాహతుండొద్దూ.

విశ్వ: తాహతు లేకపోవడమేమిటే పాతికవేలొస్తోంటే! ఏమిచేయించుకోమన్నారో చెప్పు.

కాంత: ఊహు!

కామా: రవ్వలదుద్దులు నాన్నా!

విశ్వ: అలా చెప్పవేం ఇంకనే!? అహ్హాహ్హాహ్హా. [అంతా నవ్వుతారు.]

విశ్వ: భేష్! చవట 5 రూపాయిలు పోతే పోయాయి కాని చక్కటి తలపులు పుట్టేయిమీ అందరికీ!— అయితే ఆనందం! మొత్తం లెక్కచూడు రాఘవకి తొమ్మిదివేలు, నీకు 10, అక్కడికి 19 వేలయాయి, చెల్లికి 5 వేలు, ఇంకో వెయ్యి మిగుల్తుంది.

ఆనం: ఆ వెయ్యీ అమ్మ రవ్వల్దుద్దులికి సరిపోతుంది.

విశ్వ: (నవ్వుతో) అయితే ఆఖరుకి పాతికవేలొచ్చినా నాకేమీ మిగలదన్నమాట!

రాఘు: మిగలకేం?

విశ్వ: ఏదీ! ఏంమిగిలింది?

రాఘు: నేతివాడి అప్పు! [అందరూ నవ్వుతారు.]

# పదిలక్షలకు పైగా చలిజ్వరముచే మృతినొందుచున్నారు

## డాక్టర్లు హిందూదేశపు ఈ ఉపద్రవమును ఎదుర్కొని పోరాడుచున్నారు.

ఆహారపుసంశయము పరిష్కరించబడినది. హిందూదేశములో ప్రతిసంవత్సరము చలిజ్వరము (మలేరియా)చే 10లక్షలకు పైగా జనులు మృతులగుచున్నారని సర్కారువారిచే అంచనగా వేయబడినది. అన్నికారణములవల్ల కలుగు మరణసంఖ్యలో 100కి 16వంతున ఎక్కువైనది. జ్వరమువచ్చినపుడు గమనించదగు విషయములలో ఆహారమొకటి. జ్వరమునిలచిన తరువాత కూడ జీర్ణశక్తిచాలవరకు క్షీణించుటచే ఆహారమును తలచినంతనే అసహ్యము పుట్టించును. అయినను జ్వరపువిషముచే శక్తిహీనమైన నరస్నాయువులకు తప్పక శక్తినికూర్చవలయును. దీనికితగు ఆహారము హార్లిక్సని డాక్టర్లు గ్రహించియున్నారు. పెలకొలది రోగులకు దీనినిచ్చి పరీక్షించగా ఎటువంటి నిర్బలులైనను దీనిని జీర్ణించుకొనగలరని తెలుపబడినది. ఇది వందకు వంద పుష్టినిచ్చునదిగాన స్నాయువులలోపోయి దేహమంతటికిని బలమును చేకూర్చును. రోగులకు హార్లిక్సే తగుమైన ఆహారమని డాక్టర్లు దీనినే సిఫారసుచేసి యున్నారు.